ప్రజాశక్తి

మంగళవారం 14 జనవరి 2025

1



అనంతపురం



శ్రీ సత్యసాయి

కనిపించని సంక్రాంతి

పల్లె పండుగ సంక్రాంతి... పంట ఇంటికొచ్చిన సమయంలో జరిగే ఈ పండుగ పల్లెకు కొత్త సందడిని తెస్తుంది. రంగురంగుల ముగ్గులు, వాటి మధ్యలో గొబ్బెమ్మలు, పిండి వంటల ఘుమఘుమలతో ప్రతి ఇల్లు పండుగ శోభతో వెలిగిపోతుంది. హరిదాసు కీర్తనలు, గాలిపటాలు, బసవన్న చిందులు, భోగి మంటలతో సంక్రాంతి మూడు రోజులపాటు ఎంతో వైభవం సంక్రాంతి వేడుక జరుగుతుంది. అయితే ఈ సందడి ఈసారి పల్లెలో కనిపించడం లేదు. పంటలు ఆశించినంతగా రైతుకు దక్కలేదు. 2024 ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు, వర్షాభావం రెండింటి మూలంగా రైతు రెండు విధాలుగానూ నష్టపోయారు. పెట్టుబడులు కూడా సరిగా రాకపోవడంతో రైతుల చేతుల్లో డబ్బుల్లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. దీనికితోడు పెరిగిన నిత్యావసర ధరలు పిండి వంటలకూ సామాన్య మధ్యతరగతి ప్రజలను దూరంగా చేశాయి.

◆ పల్లెల్లో పండుగ సందడి కరువు


◆ సామాన్యులపై ధరల దరువు

◆ ఆకాశాన్నంటిన నిత్యావసరాలు.. కూరగాయలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, హిందూపురం

పల్లె పండుగ సంక్రాంతి... పంట ఇంటికొచ్చిన సమయంలో జరిగే ఈ పండుగ పల్లెకు కొత్త సందడిని తెస్తుంది. రంగురంగుల ముగ్గులు, వాటి మధ్యలో గొబ్బెమ్మలు, పిండి వంటల ఘుమఘుమలతో ప్రతి ఇల్లు పండుగ శోభతో వెలిగిపోతుంది. హరిదాసు కీర్తనలు, గాలిపటాలు, బసవన్న చిందులు, భోగి మంటలతో సంక్రాంతి మూడు రోజులపాటు ఎంతో వైభవం సంక్రాంతి వేడుక జరుగుతుంది. అయితే ఈ సందడి ఈసారి పల్లెలో కనిపించడం లేదు. పంటలు ఆశించినంతగా రైతుకు దక్కలేదు. 2024 ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు,

మిగతా 3లో





తాడిపత్రిలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

నిరసన మంటలు..!

◆ విద్యుత్ భారాలపై సిపిఎం, సిఐటియు ఆందోళనలు

◆ భోగి మంటల్లో బిల్లులు దహనం

విద్యుత్ భారాలపై ప్రజాగ్రహం వ్యక్తం అయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్దుబాటు ఛార్జీలపై వేస్తున్న అదనపు భారాలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. భోగిని పురస్కరించుకుని విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. పెంచిన విద్యుత్ బిల్లులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. తాడిపత్రిలో జరిగిన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పాల్గొని ప్రజలతో కలిసి విద్యుత్ బిల్లులను దహనం చేశారు.

వార్త 2,6లో


ధర్మవరంలో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న నాయకులు


పుట్టపర్తిలో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న నాయకులు


హిందూపురంలో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న నాయకులు


ఓబుళదేవర చెరువలో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న నాయకులు

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో దహనం


కదిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు


పుట్టపర్తిలో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ డి.దిల్షాద్ డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సర్కిల్‌లో విద్యుత్ బిల్లులను తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దిల్షాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల భారాన్ని. విద్యుత్ చార్జీల రూపంలో ప్రజలపై వేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ పేరుతో 15 వేల కోట్ల విద్యుత్ చార్జీలను పెంచిందన్నారు. మార్చి నుండి మరో రూ.14 వేల కోట్ల భారం వేయడానికి సిద్ధమవుతున్నారన్నారు. విద్యుత్ భారాలకు గత ప్రభుత్వం కారణమైతే సెకి ఒప్పందం ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు.ఒకవైపు సంక్షేమ పథకాలు కుదించి, మరోవైపు భారాలు వేయడంపై ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వం మీద వ్యతిరేకత పెరుగుతోందన్నారు. అదానీ కంపెనీ లాభాల కోసం ప్రజలను బలిపెట్టే విధానాలు తక్షణమే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ఎస్‌హెచ్. భాషా, మారుతీ, సిఐటియు నాయకులు జెవి. రమణ, టీ.అయుబ్ ఖాన్, ఎల్ ఆదినారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున, చేనేత కార్మిక సంఘం నాయకులు హరి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: ట్రూ ఆఫ్ చార్జీలు తదితర వాటి పేరుతో ప్రజలపై వేస్తున్న భారాలను వెంటనే రద్దు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్‌ఛార్జీల పెంపును నిరసిస్తూ కొత్తచెరువు పుట్టపర్తి ప్రాంతాలలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహణం చేశారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ విద్యుత్తు సర్దుబాటు చార్జీల పేరుతో చేస్తున్న ఆదాని విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై విద్యుత్ భారాలను తగ్గించాలని విద్యుత్తు ట్రూ ఆఫ్ చార్జీలు పెంపు తగ్గించేవరకు ఉద్యమిస్తామని తెలిపారు. ప్రజలు ఈ పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు పెంచినప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నాయకుడుగా ఉంటూ బాదుడే బాదుడు అని రాష్ట్రంలో ప్రచారం చేశాడని అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలపై అదనపు చార్జీల పేరుతో 17 వేల కోట్ల రూపాయలు భారం మోపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను ప్రజలపై భారం తగ్గించాలని లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదానితో చేసుకున్న ఒప్పందాలతోనే రైతులు పేదలపై భారీ స్థాయిలో విద్యుత్ భారం పడుతోందన్నారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ఆదాని ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాల్ల అంజి, ముత్యాలు, శంకర్ రెడ్డి, నాగమణి, శ్రావణి, శాఖ కార్యదర్శి తిరుపాల్, చిన్నోడు, వెంకటయ్య, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : రాష్ట్ర ప్రభుత్వం ఆదాని కోసం పని చేస్తున్నదా...లేక ప్రజల కోసం పని చేస్తున్నదా కూటమి ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం జిల్లా నాయకులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సిపిఎం, సిఐటియు, కెవిపిఎస్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేసి నిరసన తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని మంత్రి నారా లోకేష్ ప్రజలకు పిలుపునిచ్చి.. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే స్మార్ట్ మీటర్లు బిగించడం ఎంత వరకు న్యాయం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సదాశివరెడ్డి, సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, కో కన్వీనర్ రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ. సిఐటియు పట్టణ కమిటీ నాయకులు మల్లికార్జున, జగదీష్, చంద్ర, ఆనంద్, ప్రికార్టు బి యూనియన్ సిఐటియు నాయకులు శివ శంకర్, శ్రీధర్, అంజి, రమేష్, వెంకటేష్ రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని సిపిఎం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, వివి రమణ మాట్లాడుతూ విద్యుత్ సర్దు బాటు చార్జీలను రద్దు చేయాలని ,స్మార్ట్ మీటర్లు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ కుళ్లాయప్ప, శ్రీరాములు, పంచాయతీ కార్మికులు అంజనప్ప, నాగమ్మ, నిర్మల, శ్రావణి, లక్ష్మీనరసమ్మ, లక్ష్మీదేవి, ఓబులమ్మ, సాలెమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదానికి లాభం చేకూర్చేందుకు ప్రజలకు నష్టం కలిగించే విధంగా ప్రజల పై విద్యుత్ భారాలు మోపుతున్నారని సిపిఎం పట్టణ కార్యదర్శి నరసింహులు విమర్శించారు. విద్యుత్ భారాలు తగ్గించాలని స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తు సోమవారం పట్టణంలోని రాయలసీమ కూడలి వద్ద సిపిఎం ప్రజా సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. విద్యుత్ బిల్లులను భోగి మంటలలో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, బాబ్జాన్, ముస్తక్, రఫీ, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామనిసిఐటియు, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు రూ. 16 వేల కోట్లు విద్యుత్ చార్జీల రూపంలో ప్రజలపై భారం మోపుతోందన్నారు. మార్చి నుంచి మరో రూ. 14 వేల కోట్లు భారం మోపడానికి కూటమి ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు నాగార్జున, వెంకటేశు, చిన్నకృష్ణ, పెద్ద వీరన్న, రమేష్, సుధాకర్, అనిత, మారక్క, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ : పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నగర పంచాయతీ పరిధి లోని తిమ్మాపురం గ్రామంలో సిఐటియు ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లలను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ పేరుతో ప్రజలపై రూ. 15వేల కోట్ల భారాలు మోపింద న్నారు. ఓ వైపు సంక్షేమ పథకాలను కుదించి మరోవైపు అదానీ కంపెనీకి లాభాల కోసం ప్రజలపై భారాలు వేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో వినోద్, నరసింహ, శ్రీహరి, తదితరులు పాల్గొ న్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న సిఐ ఆంజినేయులు, నాయకులు

కెవిపిఎస్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని అప్ గ్రేడ్ స్టేషన్ లో సిఐ ఆంజినేయులు చేతుల మీదుగా కులవివక్ష పోరాట సమితి (కెవిపిఎస్) 2025 డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ ఆంజినేయులు మాట్లాడుతు డైరీలో అంబేడ్కర్, పూలే, సావిత్రి బాయి పూలే, బాబు జగజ్జీవన్ రావు జీవిత చరిత్రలతో పాటు జస్టిస్ పున్నయ్య కమిషన్ పొందు పరచిన 28 జీవోలతో పాటు సమాచార హక్కు చట్టం గురించి పొందుపర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, కెవిపిఎస్ నాయకులు గోపాలకృష్ణ, గోపాల్, రాయుడు, ఎస్ఎఫ్ఐజిల్లాఉపాధ్యక్షులు బాబావలి పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం


తమ గురువులతో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - పరిగి

మండల పరిధిలోని ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది.కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోజ్ ఆరాధ్య అధ్యక్షత వహించారు. పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. సంవత్సరంలో కనీసం 3-4 ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ పాఠశాలకు ఏదో విధంగా సహకరిస్తున్నారని ఉపాధ్యాయులు చెప్పారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వేణు గోపాల గుప్త మాట్లాడుతూ మారుమూల గ్రామంలో జన్మించి ఉన్నత స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ఫణి కుమార్, తెలుగు ఉపాధ్యాయురాలు ఏలియా, గణిత ఉపాధ్యాయులు బాలకృష్ణ సైన్సు ఉపాధ్యాయులు,ప్రస్తుత డీ.హీరేహాల్ మండల విద్యాధికారి షానవర్ బాషా మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నూర్ మహమ్మద్, పూర్వ విద్యార్థులు అశోక్ కుమార్, ఆంధ్రరత్నం అశోక్, రామచంద్ర, రామాంజినేయులు, కట్ల నరసింహమూర్తి, లవీన్ కుమార్ రెడ్డి, ప్రకాష్, శివ కుమార్, పుష్పావతి, మంగమ్మ, రాజేశ్వరి,ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసరాల అందజేత కార్యక్రమంలో పాల్గొన్న రత్నాకర్, తదితరులు

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామం నిరుపేదలకు శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ఆర్జే రత్నాకర్ చేతుల మీదుగా ఒక జత బట్టలు సరుకులను అందజేశారు. బత్తలపల్లి గ్రామంలోని ఆర్డీటీ పాఠశాలలో సోమవారం భోగి పండుగ సందర్భంగా పేద ప్రజలకు ఆస్ట్రేలియా న్యూజిలాండ్, దేశాలకు చెందిన సత్యసాయి భక్తుల ఆర్థిక సాయంతో సత్యసాయి ట్రస్టీ రత్నాకర్ చేతుల మీదుగా నిత్యావసర సరుకులు, చీరలు, పంచెలు అందజేశారు. గ్రామంలోని 108 కుటుంబాలకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి విదేశీ భక్తులు, ట్రస్ట్ సభ్యులు బత్తలపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా భోగి సంబరాలు



పుట్టపర్తిలో భోగిమంటల వద్ద ప్రజలు


కదిరిలోని లక్ష్మినరసింహస్వామి నగర్‌లోభోగిమంటల వద్ద ప్రజలు


ధర్మవరంలో కళాకారులతో మంత్రి సత్యకుమార్‌యాదవ్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాలకు వలసలు వెళ్లిన వారందరూ తమ తమ గ్రామాలకు చేరుకొని బంధువులతో ప్రజలతో పండుగ సంబరాలు చేసుకున్నారు. గతంలో సంక్రాంతి పండుగ అంటే ఎంతో సందడిగా చేసుకునేవారు. ఇంటికి ధాన్యాలు చేరుకున్న శుభవేళ ఇంటిల్లిపాది మూడు రోజుల పాటు కొత్త బట్టలతో సంతోషంగా గడిపేవారు. గంగిరెద్దులు, హరిదాసుల కీర్తనలతో పల్లెల్లో ఘనంగా జరుపుకునేవారు. కొత్తగా పెళ్లయిన ఆడబిడ్డలు అల్లుళ్లతో సందడి సందడిగా ఆనందంగా ఉండేవాడు. ఆనాటి మధుర క్షణాలు ఈనాడు మచ్చుకైనా కానరావు. పెట్టుబడి దారీ వ్యవస్థ బలంగా వేళ్లూనుకుని పోవడం, హైటెక్ విధానాలు, కంప్యూటరీ యుగంలో ప్రతి మనిషి పని విలువ పెరిగింది. ఆనాటి పాడి పంటలు లేవు. అయినప్పటికీ నాటి సంప్రదాయాలను కొనసాగిస్తూ పల్లెలలో ఈ పండుగను జరుపుకోవడం విశేషం స్థానిక శిల్పారామం తో పాటు పలుచోట్ల భోగిమంటలతో సరదాగా గడిపారు.

కదిరి టౌన్ : ఏడాది పొడవునా రైతులు కార్మికులు కూలీలు కష్టపడి శ్రమించి కొత్త ధాన్యాన్ని ఇంటికి తీసుకొచ్చి పాడి పంటలు కొత్త ధాన్యంతో ఏడాది పొడవునా ఆనందంగా గడపాలని ఆశిస్తు సంక్రాంతి పండుగను జరుపుకుంటారు .అలాంటి సంక్రాంతి భోగి పండుగను సోమవారం కదిరి పట్టణం హిందూపూర్ రోడ్డు లోని శ్రీలక్ష్మీ నరసింహ నగర్ లోని సుమారు 30 కుటుంబాలు ఎంతో ఆనందంగా జరుపుకున్నాయి. సంక్రాంతి ముగ్గులు వేసి భోగి మంటను వెలిగించి మహిళలు పిల్లలు పెద్ద ఎత్తున భోగి మంటలు చుట్టూ నృత్యాలు చేస్తూ పల్లెటూరి సాంప్రదాయాలను ప్రతిబింబింపచేశారు. చిన్నారులు గురువయ్య వేషధారణ ఆకుట్టుకుంది.

ధర్మవరం రూరల్ : భోగి పండుగ సందర్భంగా సోమవారం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పార్టీ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన భోగి వేడుకల్లో కుటుంబ సభ్యులతో, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక శిల్పారామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. శిల్పారామం ఏవో రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ సహకారంతో ఈ ముగ్గుల పోటీలు సోమవారం జరిగాయి. అధిక సంఖ్యలో ఈ పోటీలకు మహిళలు హాజరై వివిధ రంగవల్లులు వేశారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల న్యాయ నిర్ణీతలుగా పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, టిడిపి నాయకురాలు యశోద రాయుడు, భారతి, మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద తదితరులు వ్యహరించారు. బహుమతుల ప్రదాత సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రతిభ చూపిన మహిళలకు మంగళవారం సంక్రాంతి పండగ సందర్భంగా శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేస్తామన్నారు. అదేవిధంగా సంక్రాంతి ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సిలేషన్ బహుమతులు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. అలాగే మంగళవారంం శిల్పారామంలో జరిగే జబర్దస్త్ ఆర్టిస్టుల కామెడీ ప్రోగ్రాంలో పుట్టపర్తి మున్సిపాలిటీ లోని ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ధర్మవరం రూరల్ : సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం ధర్మవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పట్టణ ప్రాంత పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఏర్పాటుచేసిన వివిధ రకాల స్టాల్స్ ను మంత్రి సత్యకుమార్ యాదవ్ పరిశీలించారు. మెప్మా లో స్వయం ఉపాధి శిక్షణ పొందిన మహిళలు తయారుచేసిన, రూపొందించిన వస్తువులతో నిండిన ఈ స్టాల్స్ ఆకట్టుకున్నాయి. స్టాల్స్ లోని వస్త్రాలు, బొమ్మలు, వివిధ కళారూపాలు, తణధాన్యాలను పరిశీలించి వాటి తయారీదారులను మంత్రి ప్రశంసించారు. ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకొని ఆర్థికంగా స్థిరపడాలనే వారి సంకల్పాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మోప్మా ప్రాజెక్ట్ అధికారి పెనుబోలు విజయభాస్కర్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రవాణా అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి కదిరి టౌన్

. రవాణా శాఖ అధికారులు అనుమతులు లేకుండా కదిరి మీదుగా అడ్డగోలుగా తిప్పుతున్న బస్సులపై మెరుపు దాడులు నిర్వహించారు. ప్రయివేటు దందా శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నిబంధనలు పాటించని ప్రయివేటు బస్సు సర్వీసులపై దాడులు నిర్వహించారు.

వైసిపి జిల్లా కార్యదర్శిగా ఎం.భాస్కర్

ప్రజాశక్తి - ముదిగుబ్బ

వైసిపి జిల్లా కార్యదర్శిగా ముదిగుబ్బ మండలానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు మల్లా గుండ్ల భాస్కర్‌ను అధిష్టానం నియమించింది. ఈసందర్భంగా ఎం. భాస్కర్ సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన మీద నమ్మకంవుంచి జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేసిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అండగా ఉంటాం

ప్రజాశక్తి కదిరి టౌన్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ కుటుంబానికి అండగా ఉంటామని వాల్మీకి సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి అన్నారు. తనకల్లు మండలం తవళం గ్రామనికి చెందిన లక్ష్మీ దేవమ్మ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న బంగారు కృష్ణమూర్తి సోమవారం హాస్పిటల్ కి వెళ్ళి బాధితురాలిని పరామర్శించారు.అధైర్య పడవద్దని అండగా ఉంటామని ధైర్యంచెప్పారు. మెరుగైన చికిత్స కోసం ఎలాంటి అవసరం వున్న తనవంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఆయనతో పాటు బొట్టు చంద్ర బడోలపల్లి సుధాకర తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోనిఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న భారీ అభయాంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటు పనులను అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ సోమవారం పరిశీలించారు. ఈ నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న విగ్రహ శిల్పి అశోక్ గుడియార్‌ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. విగ్రహం ఏర్పాటు కోసం పనిచేస్తున్న ట్రస్ట్ బోర్డు చైర్మన్ వైసి చంద్రశేఖర్‌ను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ వైస్ చైర్మన్ రాయల్ గోపాల్, కమిటీ సభ్యులు గాన కిషోర్, శివ, హనుమంత తదితరులు పాల్గొన్నారు.


ట్రస్టుబోర్డు ఛైర్మన్‌ను సన్మానిస్తున్న ఎంపీ

మొదటిపేజీ తరువాయి

కనిపించని సంక్రాంతి

వర్షాభావం రెండింటి మూలంగా రైతు రెండు విధాలుగానూ నష్టపోయారు. పెట్టుబడులు కూడా సరిగా రాకపోవడంతో రైతుల చేతుల్లో డబ్బుల్లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. దీనికితోడు పెరిగిన నిత్యావసర ధరలు పిండి వంటలకూ సామాన్య మధ్యతరగతి ప్రజలను దూరంగా చేశాయి.

దడ పుట్టిస్తున్న నిత్యావసర ధరలు

నిత్యావసర ధరలు అందరినీ దడపుట్టిస్తున్నాయి. నూనె, పప్పులు, బియ్యం ఇలా అన్నింటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కిలోపైన రూ.10 నుంచి రూ.20 వరకు ధరలు పెరిగాయి. లీటరు పామాయిల్ ధర రూ.130కిపైగా ఉంది. కందిబ్యాళ్లు కిలో రూ.200లకుపైగా ఉంది. ఇతర పప్పు ధాన్యాల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. కందిపప్పు కిలో రూ.175, పెసరపప్పు కిలో రూ.130, ఎండుమిర్చి కిలో రూ.250, తెల్ల గడ్డలు కిలో రూ.380–420, ఎర్ర గడ్డలు కిలో రూ.50, శెనగపప్పు కిలో రూ.140, మినపప్పు కిలో రూ.130, గోధుమపిండి కిలో రూ.55, బెల్లం కిలో రూ.70, చింతపండు కిలో రూ.200, మైదాపిండి కిలో రూ.45, మిర్చి పొడి కిలో రూ. 300, సన్ ఫ్లవర్ ఆయిల్ కిలో రూ.142, పామ్‌ఆయిల్ కిలో రూ.135, వేరుశనగ నూనె లీటరు రూ.155 ఇలా ప్రతి నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి. దీంతో పండుగ పూట పిండివంటలు చేసుకోవాలంటే కూడా ఆలోచించుకునే పరిస్థితి నెలకొంది.

రెడీమేడ్ వంటలకు గిరాకీ

నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో రెడిమేడ్ వంటల వైపు సామాన్యులు మొగ్గు చూపుతున్నారు. ఎందుకంటే కొనుక్కొని చేసుకోవడం కంటే ఇంటికి అవసరమైన వరకు తక్కువ మోతాదులో బయట కొనుగోలు చేసుకుని పండుగను ముగించుకుంటే సరిపోతుందని భావించి ప్రయివేటు రెడీమేడ్ దుకాణాల్లో కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు. ప్రధానంగా ఓళిగలకు మంచి గిరాకీ ఉంది. దీంతో నగరంలో ఓళిగ కేంద్రాల వద్ద ఎక్కడలేని సందడి నెలకొంది. కొన్ని కేంద్రాల వద్ద బయట శామియానాలు వేసి మరీ అవసరమైన వారికి అందించే విధంగా ఏర్పాట్లు చేసియున్నారు.

తగ్గిన వ్యాపారాలు

తెలుగు పండుగల్లో సంక్రాంతి అతి పెద్ద పండుగగా చెప్పుకుంటారు. ఈ పండుగ సమయంలో కొత్త బట్టలు కొనడం, నిత్యావసర వస్తువులు కొనడం వంటి వాటితో వ్యాపారాలు పెద్దఎత్తున సాగుతూ ఉండేవి. ఈసారి అటువంటి వాతావరణం పెద్దగా కనిపించలేదు. సాధారణం కంటే 50శాతం తక్కువగానే వ్యాపారాలున్నాయని బట్టల వ్యాపారులు, కిరణా వ్యాపారులు చెబుతున్నారు. ప్రజల వద్ద తగినంత డబ్బులేకపోవడంతో తక్కువ మోతాదులోనే కొనుగోలు చేయడంతో వ్యాపారాలు ఆశించినంత జరగలేదు.

పండుగపై ధరాభారం

సుమంగళి, గహిణి హిందూపురం.

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఇంటికీ బంధువులు వస్తూ ఉంటారు. ఇది అదునుగా భావించి వ్యాపారులు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు అధిక రేట్లకు అమ్ముతున్నారు. పండుగకు సరుకులు కొనాలంటే భయమేస్తుంది. గతంలో సంక్రాంతి పండుగకు చంద్రన్న కానుక ఇచ్చేవారు.. కూటమి ప్రభుత్వం వచ్చినా కూడా చంద్రన్న కానుక ఇవ్వకపోవడం బాధాకరం.

19న యోగివేమన జయంతి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ప్రజా కవి యోగి వేమన జయంతిని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిద్దామని ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరేష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 19న ఆయన జయంతి నిర్వహించడానికి వేమన భక్తులు రెడ్డి సంఘం నాయకులు ముందుకు రావాలని కోరారు. గతంలో వేమన జయంతిని ప్రభుత్వపరంగా నిర్వహించారని ప్రస్తుత ప్రభుత్వం కూడా నిర్వహించాలని డిమాండ్ చేశారు. వేమన పద్యాలను వినని వారు ఉండరని సమాజంలో మార్పు కోసం ఆయన ఎంతో తపన పడ్డారని కుల మతాలకు అతీతంగా ఆయన పద్యాలు ఎప్పటికీ ప్రాచుర్యం పొందుతున్నాయని అన్నారు. గాండ్లపెంట మండలం కటారుపల్లిలో నల్లచెరువు మండల కేంద్రం లో ప్రతి ఏటా వేమన జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వపరంగా కటారుపల్లిలోని ఆయన సమాధి ఉన్న ఆలయంలో ఉత్సవాలు నిర్వహించిందన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. జిల్లాలో ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ప్రతి రోజు సాయంత్రం జిల్లా అంతటా విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా వాహనాల తనిఖీలు, ఫుట్ పెట్రోలింగ్ చేపట్టారు. రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన చేశారు.

ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - తాడిమర్రి

తాడిమర్రి వైపు నుండి లింగాల గ్రామం వైపు వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ధర్మవరం పులివెందుల రహదారిపై చోటుచేసుకున్న ఈ ప్రమాదం సందర్భంగా కాసేపు వాహనాలు స్తంభించాయి. అధిక వేగంతో దూసుకు వస్తున్న టిప్పర్ నుండి తప్పించుకోబోయే క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుందని ట్రాక్టర్ డ్రైవర్ తెలిపారు.అధిక బరువు ఉన్న వాహనాలు వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని వాటిని అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బిసి సంక్షేమ శాఖ అధికారిణిపై మంత్రికి ఫిర్యాదు

అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-పెనుకొండ

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ సోమవారం పిఎస్‌యు, ఎఐఎస్‌బి విద్యార్థి సంఘాల నాయకులు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితకు ఆమె నివాసంలో వినతిపత్రం ఇచ్చారు. పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పోతలయ్య మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణిగా నిర్మలజ్యోతి పెద్దఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా హాస్టల్ వార్డెన్లను బెదిరించి రూ. లక్షలు దోచుకుంటున్నారన్నారు. ఎబిసిడి బ్యుజు, ప్రజా సంఘాల నాయకులతో కోటరీ ఏర్పాటు చేసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తన సామాజిక వర్గమైన సుబ్బరాయుడు ఎంత పెద్ద తప్పుచేసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఇతరులను మాత్రం చాలా ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి రమేష్ ద్వారా వార్డెన్లకు ఫోన్ చేయించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ విషయంపైన గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. హాస్టల్ వార్డెన్ల నిర్మల జ్యోతికి ఎంత అమౌంట్ ఇచ్చారో ఆధారాలతో సహ మంత్రికి అందించారు. త్వరలో విద్యాశాఖ మంత్రి, డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు.


మంత్రి సవితకు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

18న మెగా లెజెండరీ రక్తదాన శిబిరం : ప్రభుత్వ విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీ.రామారావు వర్ధంతి సందర్భంగా ఈ నెల 18వ తేదీ పట్టణంలోని సీతారామాంజనేయ సత్రంలో నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, మహిళలకు ఆస్తిలో హక్కు, రూ. 2కే కిలో బియ్యం, తదితర విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని అమలు చేశారన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరిదేవి రెండు తెలుగు రాష్ట్రాల్లో మెగా లెజెండరీ బ్లడ్ డొనేషన్ క్యాంపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. ఆ శిబిరంలో 500 మందికి పైగా దాతల నుంచి రక్తం సేకరించి అత్యవసర మైన, ఆపదలో ఉన్న వారికి అందివ్వాలని నిర్ణయించారన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో సిఎం చంద్రబాబు మూడు దశాబ్దాలుగా రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడు నెలల్లోనే అనేక ప్రజా ఉపయోగ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పెట్టుబడిదారులకు నమ్మకం కలిగించి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తుందన్నారు. పేదరికం లేని సమాజం ఏర్పాటుకు పి-4 పత్రాన్ని విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చనున్నట్లు తెలిపారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కణేకల్లు మండల నాయకుడు లాలెప్ప, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, చేనేత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ టంకసాల హనుమంతు ఉన్నారు.


పాత్రికేయులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

వైసిపి బలోపేతానికి కృషి చేద్దాం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నియోజకవర్గంలో వైసిపిని మరింత బలోపేతం చేయడానికి సైనికుల్లా కృషి చేద్దామని మాజీ ఎంపి, నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య సూచించారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామితో కలిసి ఇటీవల పార్టీ పదవులు దక్కిన నాయకులను సన్మానించారు. అందులో పార్టీ అధికార ప్రతినిధి ముదిగల్లుకు చెందిన గోపారం శ్రీనివాసులు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కోనాపురం గంగాధర, జనరల్ సెక్రటరీ ములకలనూరు బోయ తిమ్మరాయుడు, ఆర్గనైజేషనల్ సెక్రటరీ తలారి సత్యప్ప, యాక్టివిటీ సెక్రటరీ పి.ఆనంద్ చౌదరిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన నాయకులతో మాజీ ఎంపి రంగయ్య

ముగిసిన ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం సోమ వారం ముగిసింది. ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప మాట్లాడుతూ వైద్య శిబిరంలో 5 రోజుల పాటు ప్రముఖ విదేశీ వైద్యులచే చెవి, ముక్కు, గొంతు, చర్మ, కంటి, దంత సంబంధిత వ్యాధులకు చికిత్స చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. శిబిరంలో మొత్తం 650 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వినికిడి లోపం ఉన్న 306 మందికి వినికిడి యంత్రాలు అందించామన్నారు. 350 మందికి చర్మ సంబంధిత పరీక్షలు, 160 మందికి దంత పరీక్షలు, 170 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విదేశీ వైద్యులు, ట్రస్ట్ సిబ్బంది చిట్టిబాబు, హరి, బాబు, నవ్యశ్రీ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప, వైద్యులు

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-మడకశిర

క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి, సిఐ రాగిరి రామయ్య సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 3 రోజులుగా జరుగుతున్న నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం వారు బహుమతులు అందజేశారు. గుండుమల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోల ఇలాంటి క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రెస్ క్లబ్ మెంబర్లు, కెప్టెన్లు భక్తర్‌సాబ్, సాయి, డాక్టర్ రవిశంకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నీ విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న గుండుమల


ఎన్నికైన సూర్యసేవాసమితి నూతన కార్యవర్గం

సూర్య సేవా సమితి కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని సూర్య సేవా సమితి 15వ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పసుపులేటి వెంకటేశులు, ఉపాధ్యక్షులుగా ఉబేదుల్లా, కార్యదర్శిగా బీసా శ్రీనివాసులు, ఉప కార్యదర్శిగా దబ్బిడి చంద్రశేఖర్, కోశాధికారిగా నరసింహప్రసాద్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ప్రతినిధులు మాట్లాడుతూ సూర్య సేవా సమితి 15 ఏళ్లుగా పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గం కూడా పట్టణ ప్రజల సేవకు పునరంకితం అవుతుందని తెలిపారు.


ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

శ్రీసత్యసాయి కళాశాలలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు ఇతర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అంతకుముందు భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో కళాశాల ఏవో కేశవయ్య, అధ్యాపకులు వినోద్, అనిల్, నవీన్, వరలక్ష్మి, రమ్య, శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.


పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి

ఆవాజ్ కన్వీనింగ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణ ఆవాజ్ కన్వీనింగ్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం ఎస్.బాబావలి అధ్యక్షతన ఆవాజ్(ముస్లిం అభివృద్ధి వేదిక) సమావేశం నిర్వహించారు. కమిటీ నూతన కన్వీనర్‌గా ఎస్.మహబూబ్‌బాషా, సభ్యులుగా బాబావలి, ఆరిఫ్, హబీబ్, సిరాజ్, సకీబ్, సర్వరాజ్ ఎన్నికయ్యారు. బాబావలి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 ఏళ్ల గడిచినా ముస్లిం మైనార్టీల పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందన్నారు. ముస్లిం మైనార్టీలు అంటే కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారన్నారు. ఎన్నికల సందర్భంలో మాత్రమే పలకరించే రాజకీయ నాయకులు, స్వప్రయోజనాల కోసమే పావులుగా వాడుకునే మైనార్టీ పెద్దలు, ముస్లింల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ముస్లింల హక్కులు వారికి దక్కేలా, లౌకిక విలువలను విస్తృత ప్రచారం చేయడం, చైతన్యపరచడం, మైనార్టీల అభివృద్ధి, భద్రత, లౌకికతత్వం లక్ష్యాలుగా ఆవాజ్ పనిచేస్తుందన్నారు. ముస్లిం మైనార్టీలకు రాష్ట్ర బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని, 10 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న బాబావలి

వేపులపర్తిలో గోకులం షెడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం


మండలంలోని వేపులపర్తి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన గోకులం షెడ్డును సోమవారం టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు అధ్యక్షతన ఘనంగా ప్రారంభించారు. శ్రీరాములు మాట్లాడుతు గత వైసిపి ప్రభుత్వం రైతులను విస్మరించిందని, కనీసం పశువుల పోషణకు కూడా ఎలాంటి అవకాశాలు కల్పించకుండా నానా ఇబ్బందులు పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే రైతులకు అండగా ఉందన్నారు. ఇందులో భాగంగానే పశువులు, గొర్రెలు వ్యాధుల బారిన పడకుండా ఉపాధి హామీ ద్వారా రైతు వాటా 10శాతంతో గోకులం(పశువుల) షెడ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బీమప్ప, నాయకులు నాగరాజు, హనుమం తప్ప, వన్నూరుస్వామి, శివలింగ, వెంకటేష్, నాగరాజు, కత్తాలి రవి, చంద్ర, టెక్నికల్ అసిస్టెంట్ అవినాష్, బిటిపి కుడికాలువ చైర్మన్ గోవిందు, ఫీల్డ్ అసిస్టెంట్ కొత్తిండ్ల రవి, రామచంద్ర, ఎరడికెర రామకృష్ణ, పాలవెంకటాపురం వినాయక్, కురిమళ్లి, వీరేశ్, నాగేంద్ర, పెన్నప్ప పాల్గొన్నారు.


గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న పాలబండ్ల శ్రీరాములు

వైసిపి నాయకులకు సన్మానం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఐ.గంగాధరప్ప, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు సూగేపల్లి రేవన్న, కంబదూరు మండల పరిషత్ అధ్యక్షులు కురుబ భీమేష్‌ను సోమవారం ఆ పార్టీ శ్రేణులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. వారు పార్టీ అధినేత వైఎస్.జగన్మోహన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి కంభం చంద్రశేఖర్, సర్పంచి పోలేపల్లి లోకేష్, నాయకులు పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, వేపులపర్తి ఎంపిటిసి బసప్ప, భైరవానితిప్ప సర్పంచి శెట్టిగారి మంజునాథ్, కైరేవు సర్పంచి గంగాధర, వైఎస్ సర్పంచి సన్న నీలప్ప, నాయకులు లింగప్ప, మహాత్మరెడ్డి, మహలింగప్ప, నటరాజ, రామంజి, రమేష్, డాక్టర్ వసంత్ కుమార్, తిప్పేస్వామి పాల్గొన్నారు.


రేవన్న, భీమేష్‌ను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

ట్రేడ్‌లైసెన్స్ డబ్బులు పక్కదారి..!

విజిలెన్స్ తనిఖీలతో వెలుగు చూస్తున్న అవినీతి బాగోతం

చేతి రసీదులు ఇచ్చిన అప్పటి ప్రజారోగ్య సిబ్బంది

అనంత కార్పొరేషన్‌పై వరుస విమర్శలు



ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈ నెల 10న విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రజారోగ్య సిబ్బంది అవినీతి చేతివాటం ఒక్కొక్కటిగా వెలుగు చూసినట్లు సమాచారం. ట్రేడ్‌లైసెన్స్ ఫీజుల పేరుతో వసూలు చేసిన డబ్బులు పెద్ద ఎత్తున పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డు బైపాస్ వద్ద ఉన్న వైభవ్ రెసిడెన్సీకి 2011లో అప్పటి శానిటరీ ఇన్స్‌పెక్టర్, ఇప్పటి ఎమ్మిగనూరు కమిషనర్ గంగిరెడ్డి ఫీజు వసూలుకు సంబంధించి చేతి రసీదు రాసి ఇచ్చారు. ఇందుకు సంబంధించిన డబ్బులు ఇప్పటి వరకు మున్సిపల్ కార్పొరేషన్ ఖజానాకు జమ కాకపోవడం గమనార్హం. 10వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో వైభవ్ రెసిడెన్సీ యజమాని శానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగిరెడ్డి చేతిరాత రసీదుతో వారు కట్టిన ఫీజుల దస్త్రాలు తీసుకొచ్చి హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి, కమిషనర్ రామలింగేశ్వరకు చూపించారు. తాము ఫీజులు కట్టినా 2011 నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజులు బకాయి ఉన్నట్టు మున్సిపల్ కార్పొరేషన్ రికార్డులు చూపటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై రాష్ట్ర విజిలెన్స్ డైరెక్టర్ అనంత కమిషనర్ రామలింగేశ్వరకు ఫోన్ చేసి ఈ అంశంపై వాకబు చేయటంతో కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారుల్లో దడపుట్టుకొచ్చింది. వైభవ్ రెసిడెన్సీ యాజమాన్యం తాము కట్టిన రసీదులను చూపుతూ మున్సిపల్ కార్పొరేషన్ రికార్డుల్లో జమకాని అంశంపై కోర్టుకు సైతం వెళ్తామని కార్పొరేషన్ అధికారులను హెచ్చరించినట్టు తెలుస్తోంది. గతంలో పని చేస్తున్న శానిటరీ ఇన్స్‌పెక్టర్ సురేంద్ర సైతం ఫీజు వసూళ్లకు సంబంధించి చేతి రసీదు కాగితాలు కొన్ని వెలుగు చూశాయి. ఈ చేతిరాత రసీదుల ఫీజులు కార్పొరేషన్ ఖజానాకు ఇప్పటికీ జమకానట్లు తెలుస్తోంది. కొందరు ప్రజారోగ్య సిబ్బంది ఈ డబ్బులను పక్కదోవ పట్టించారనే విమర్శలు ఉన్నాయి.

గడిచిన ఐదేళ్ల కాలంలో సచివాలయ సిబ్బంది ఆయా వార్డుల పరిధిలో వసూలు చేసిన ట్రేడ్ లైసెన్స్ ఫీజులు సైతం అధిక శాతం ఖజానా ఖాతాకు జమ కానట్లు తెలుస్తోంది. తాము వసూలు చేసిన ఫీజు మొత్తాలను జాబితాల వారీగా తయారుచేసి ప్రజారోగ్య విభాగానికి అందజేసినా ఆన్‌లైన్‌లో వాటిని జమ చేయకుండా పెండింగ్ అరియర్స్ కింద చూపటంతో సచివాలయ సిబ్బంది దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కార్పొరేషన్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లు గడచిన ఆరేళ్ల కాలంలో ఏ ఒక్క ఆర్థిక సంవత్సరం 100 శాతం చేరుకోలేదు. పూర్తి స్థాయిలో వసూలు చేసే దిశగా ప్రజారోగ్య విభాగాధిపతి, హెల్త్ ఆఫీసర్లు దృష్టి సారించలేదు. 2019 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు 50 శాతం మేరకే ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లు జరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 చూస్తే ఇప్పటి వరకు కేవలం 26శాతం వసూళ్లు అయ్యాయని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. కార్యాలయ రికార్డుల ప్రకారం ఇలా ఉంటే వ్యాపారులు మాత్రం లైసెన్స్ ఫీజులు క్రమం తప్పకుండా పూర్తిగా చెల్లించామనే అనే విధంగా చెబుతున్నారు. దీనిపై ఎవరైనా వ్యాపారులు ప్రశ్నిస్తే అధికారులు అడ్డగోలు సమాధానం చెప్పి తప్పించుకుంటున్నారు. అప్పట్లో ఉన్నతస్థాయి అధికారి విభాగ సిబ్బందితో మిలాఖత్ అయ్యి చెల్లించిన డబ్బులను పక్కదోవ పట్టిచారనే విమర్శలున్నాయి.

కమిషనర్ల ఉదాసీన వైఖరితో ట్రేడ్ లైసెన్స్ ఫీజుల బకాయిలు రూ.3.94 కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్ల అవినీతి బాగోతంలో చేతి రసీదులు ఇచ్చి జేబులో నింపుకున్న ప్రజారోగ్య సిబ్బంది అవినీతి అక్రమ కార్యకలాపాలపై విజిలెన్స్ శాఖ పూర్తి స్థాయిలో దష్టి నిలపడంతో అధికార యంత్రాంగం బెంబేలెత్తుతోంది. ప్రజారోగ్య సిబ్బంది అవినీతి కారణంగా అనంతపురం కార్పొరేషన్ ఖజానాకు గండి పడిందనే వాదన బలంగా విన్పిస్తోంది. ఈ అవినీతి బాగోతంపై సాక్షాత్తు విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ దష్టి సారించడంతో గత ఆరేళ్ల కాలంలో స్వాహా చేసిన లక్షల రూపాయల ఫీజు మొత్తాలను వెనక్కు కట్టించేలా కమిషనర్ రామలింగేశ్వర చర్యలు తీసుకుంటారా..? లేక ఎప్పటిలాగే వాటిని తూతూ మంత్రంగా విచారించి అటకెక్కిస్తారా..? అన్నది వేచి చూడాల్సి ఉంది.

చట్టసభల్లో యువతకు రిజర్వేషన్లు కల్పించాలి

ఆలిండియా యూత్ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు ఎం.నరేంద్ర

ప్రజాశక్తి-ఉరవకొండ

కేంద్ర, రాష్ట్ర చట్టసభల్లో 30శాతం, స్థానిక సంస్థల్లో 50శాతం యువతకు రిజర్వేషన్లు కల్పించాలని ఆలిండియా యూత్ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు ఎం.నరేంద్ర డిమాండ్ చేశారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఉరవకొం డలో ఏర్పాటు చేసిన జాతీయ యువ జన దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే యువతతోనే సాధ్యమ న్నారు. వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని విద్యావేత్తలైన సమాజ సేవలో భాగస్వాములుగా ఉన్న వారిని గుర్తించి కులాలకు మతాలకు అతీతంగా 25 నుంచి 35ఏళ్ల వయస్సు ఉన్న వారికి రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాప కులు వెంకట్, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాప కులు నాగవల్లి ఓబులేసు, యువజన నాయకు లు, విద్యావేత్తలు, తదితరులు పాల్గొన్నారు.


జాతీయ యువజన దినోత్సవంలో పాల్గొన్న నరేంద్ర, తదితరులు

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లా ప్రజలందరికీ శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుజాతి సగర్వంగా జరుపుకునే అచ్చమైన తెలుగు పండగ సంక్రాంతి అని రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగు వాకిళన్నీ పండగ శోభాయమానంతో కళకళలాడుతూ అచ్చమైన తెలుగుదనం ఉట్టిపడేలా ఈ పండుగ అందరికీ శుభాలను చేకూర్చాలన్నారు. బంధువులు, మిత్రులు, ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సంతోషంగా గడపాలన్నారు. ముఖ్యంగా రైతులకు సకాలంలో వర్షాలు పడి పంటలు సమృద్ధిగా పండి ఆనందంగా ఉండాలని వారికి ఆర్థికంగా కలిసి రావాలని ఆకాంక్షించారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

పుట్లూరు : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం ఒక ప్రకటనలో నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి పండుగ సందర్భంగా రైతులకు కొత్తగా పండించిన ధ్యానం ఇళ్లకు రావడం చాలా సంతోషమన్నారు. ప్రజలందరూ ధన, ధాన్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మండలవ్యాప్తంగా భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం వేకువజామునే భోగి మంటలు వేశారు. తర్వాత సంక్రాంతి ముగ్గులు వేసి ఇళ్ల ముందు గొబ్బెమ్మలు పెట్టుకున్నారు.

ఎన్‌ఆర్‌ఐ సీడ్స్‌తో కంది దిగుబడులు

ప్రజాశక్తి -అనంతపురం

ఎన్‌ఆర్‌ఐ సీడ్స్ కంపెనీకి చెందిన రెడ్ గ్రామ్ సూర్య రకం సాగు రైతులకు లాభాలను ఇస్తోంది. ఈ విత్తనం సాగుతో ఎకరాకు పది క్వింటాళ్ళు దిగుబడి వచ్చినట్లు గుంతకల్లు మండలం జి.కొట్టాల గ్రామ రైతు సతీష్ తెలిపారు. 2024 జులై 18న ఎన్‌ఆర్‌ఐ సీడ్స్ కంపెనీకి చెందిన రెడ్ గ్రామ్ సూర్య రకం 10 ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ అధికారులు, కంపెనీ ప్రతినిధులు సూచనలు తీసుకుని సాగు చేశానన్నారు. 2024 డిసెంబర్ 29న నూర్పిడి చేయగా ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. మార్కెట్‌లో క్వింటా రూ. 7 వేల చొప్పున అమ్మినట్లు తెలిపారు. ఇందుకు సహకారం అందించిన వ్యవసాయ అధికారులు, ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధులు, డీలర్లకు రైతు కతజ్ఞతలు తెలిపారు.


రైతు సతీష్‌ను అభినందిస్తున్న కంపెనీ ప్రతినిధులు, డీలర్లు

గురుస్వాములకు సత్కారం

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకులు, గురుస్వాములను మాలధారులు సత్కరించారు. అయ్యప్పస్వామి మాలదారులు ఇరుముడి కట్టుకును సందర్భంగా వారిని శాలువా పూలమాలలతో సత్కరించారు. అనంతరం మాలధారులు శబరిమలైకి బయల్దేదేరి వెళ్లారు.

పరిహారం మంజూరుపై హర్షం

బెలుగుప్ప : హంద్రీనీవా 36వ కాలువకు భూములు కోల్పోయిన రైతులకు రూ.99.54 లక్షలు మంజూరు చేయడంపై స్థానిక టిడిపి నాయకులు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోపు నిధులు మంజూరు చేయించడంపై ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పెనుకొండలో సంక్రాంతి సంబరాలు

మంత్రి సవిత ఆధ్వర్యంలో నిర్వహణ.. ముగ్గులు, కోడి పందేలు, పొట్టేళ్ల పోటీలు

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో పెనుకొండలో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ముగ్గుల పోటీలు, కోడి పందేలు, పొట్టేళ్ల పోటీలు, తాడు లాగుడు తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మంత్రి సవిత పాల్గొని పోటీదారులను ఉత్సాహపరిచారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి 163 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. పోటీలకు పరిగి తహాశీల్దార్ హసీనా సుల్తానా, స్థానిక ఉపాధ్యాయులు న్యాయ నిర్ణయితలుగా వ్యవహరించారు. ముగ్గుల పోటీల్లో పెనుకొండకు చెందిన శ్రీదేవి మొదటి బహుమతి రూ.పదివేలు గెలుచుకుంది. పద్మావతి ద్వితీయ, భార్గవి తృతీయ స్థానాల్లో నిలవగా మంత్రి నగదుతో పాటు జ్ఞాపిక అందించారు. పోటీల్లో పాల్గొన్న 163 మంది మహిళలకూ ప్రోత్సాహక బహుమతులను అందించారు. మహిళలు వేసిన ప్రతి ముగ్గునూ మంత్రి పరిశీలించి, అభినందలు తెలిపారు. మంత్రి సవిత స్వయంగా ఎద్దుల బండి నడిపారు. పిల్లలు సాంస్కతిక కార్యక్రమాలు పలువురి ని ఆకట్టుకున్నాయి.

నమ్మకం నిలబెట్టుకునేలా పాలన : మంత్రి

సంక్రాంతి సంబరాల సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి సవిత మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తున్నామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినవిధంగా మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. తల్లికి వందనం పథకం అమలు చేయబోతున్నామన్నారు. రైతులకు అన్నివిధాలా మేలు కలిగేలా పాలన సాగిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం రాగానే రాష్ట్ర ప్రభుత్వం తరపున వాటా సాయం అందజేయనున్నట్లు తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ కింద త్వరలో పరికరాలు పంపిణీ చేయనున్నామని మంత్రి తెలిపారు. రెవెన్యూ సదస్సులు, పొలం పిలుస్తోంది, పల్లె పండుగ పేరుతో రాష్ట్రంలో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసిలు నారాయణస్వామి, మునిమడుగు వెంకట రాముడు, శ్రీనివాసులు, టిడిపి కన్వీనర్లు సిద్దయ్య, శ్రీరాములు యాదవ్, సిద్ధ లింగప్ప, నరహరి, గోవిందరెడ్డి, చంద్రమౌళి, మాజీ ఎంపిపి కేశవయ్య, లక్ష్మీనారాయణ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, త్రివేంద్ర, చంద్రకాంతమ్మ, రమణమ్మతో పాటు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడుతున్న మంత్రి సవిత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి

విద్యుత్ భారాలు తగ్గించాల్సిందే..

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్-జిల్లావ్యాప్తంగా భోగి మంటల్లో కరెంటు బిల్లులు వేసి నిరసన



రాయదుర్గంలో భోగి మంటల్లో విద్యుత్ ఛార్జీల బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి

రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచిన విద్యుత్ భారాలను తగ్గించాల్సిందే అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం జిల్లావ్యాప్తంగా భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. ఇందులో భాగంగా తాడిపత్రిలోని గాంధీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన భోగి మంట్లో కరెంటు బిల్లులు దహనం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వి.రాంభూపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై రూ.15వేల కోట్ల భారం వేయడం బాధాకరమన్నారు. ఇది చాలదన్నట్లు మార్చిలో మరోమారు రూ.14,156 కోట్ల భారం వేయడానికి సిద్ధపడుతోందన్నారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు ప్రజలపై భారాలు వేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోపు వేలకోట్లలో విద్యుత్ ఛార్జీలను ప్రజలపై వేయడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలు కుదిస్తూ అనేక స్కీములు అమలు చేయకుండా వాయిదాలు వేస్తూనే మరోవైపు ప్రజలపై భారాలు వేయడంలో ముందుంటోందన్నారు. ప్రజలపై భారాలు మోపుతున్న విధానంపై దృష్టి మరల్చేందుకు రోజుకో కొత్త ఎజెండా ముందుకు తీసుకొస్తుందని ఆరోపించారు. ఇందులో భాగమే మొన్న తిరుపతి లడ్డు వివాదం.. నేడు తిరుపతిలో తొక్కిసలాట.. క్షమాపణ వంటివి రాష్ట్ర సమస్యగా మార్చేశారన్నారు. రాష్ట్ర ప్రజలపై బాధ్యత ఉంటే తక్షణం పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, మార్చి తర్వాత వచ్చే విద్యుత్ వారాన్ని ప్రజలపై మోపకుండా ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. వీటికితోడు స్మార్ట్‌మీటర్లు, విద్యుత్ ఛార్జీల పేరుతో అదానీ కంపెనీకి ఊడిగం చేసే ప్రయత్నాలు మొదలు పెట్టిందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ భోగి సందర్భంగా మంటల్లో పెంచిన విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

బుక్కరాయసముద్రం : పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఓ.నల్లప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచడం అన్యాయమని, తాము అధికారంలోకి వస్తే తగ్గిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోపు సుమారు రూ.17వేల కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపడం బాధాకరమన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. విద్యుత్ కంపెనీలతో ఒప్పందాలను చేసుకుని వారికి ఆదాయం చేకూరుస్తూ ప్రజలకు ఇబ్బందులకు గురి చేయడం మంచిది కాదన్నారు. వెంటనే విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, మండల కమిటీ సభ్యులు సి.నాగేంద్ర, నెట్టికంటయ్య, సంజీవరెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు, వేణుగోపాల్, హరికృష్ణ పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ అనంతపురం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలో సుమారు 43 చోట్ల భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా వాటి విధానాల్లో ఎలాంటి మార్పు లేదని విమర్శించారు. కార్పొరేట్లకు రాయితీలు కల్పించి.. ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం అమానుషమన్నారు. అలాగే నారా లోకేష్ ఎన్నికల ముందు చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా స్మార్ట్ మీటర్లను పగులగొట్టాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లు బిగించడం బాధాకరమన్నారు. వెంటనే విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవడంతోపాటు స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాల రంగయ్య, నాగేంద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్‌వి.నాయుడు, వెంకట నారాయణ, ముత్తూజ, నగర కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, వలి, మసూద్, ప్రకాష్, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు ఓబులేసు, బుల్లే రాజు, జీవ, ఎన్టీఆర్ శ్రీనివాసులు, వెంకటేశు, బాలకృష్ణ, బాబా, రామాంజనమ్మ, లక్ష్మీనరసమ్మ, ఎటిఎం నాగరాజు, లతీఫ్, గఫూర్, వెంకట్, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, ఆది పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రంలో భోగి మంటల్లో విద్యుత్ ఛార్జీల బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, నాయకులు

సిఐటియు ఆధ్వర్యంలో..

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులు, హమాలీ, ఆటో, భవన నిర్మాణ కార్మికులు, తోపుడు బండ్ల తదితర రంగాల కార్మికులు విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఇందులో భాగంగా నగరంలోని అంబేద్కర్ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్, ముత్తుజా, వెంకటనారాయణ, ఎటిఎం నాగరాజు, ఎన్టీఆర్ శ్రీనివాసులు, ఎర్రిస్వామి, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సోమవారం అనంతపురం రూరల్ మండలం ఐఎంఎల్ డిపో వద్ద భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ ప్రజలపై పడుతున్న భారాలను కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మోహన్‌రెడ్డి, డిపో మేస్త్రీ నాగార్జున, యూనియన్ రాష్ట్ర నాయకులు తిరుపాలు, హమాలీలు మోహన్‌బాబు, నల్లప్ప, ఆంజనేయులు, ప్రతాప్‌రాజు, చెన్నారెడ్డి, నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పెంచిన విద్యుత్ ఛార్జీలను వ్యతిరేకిస్తూ సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా జెడ్.వీరారెడ్డి కాలనీలో సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, దాసరికాలనీలో ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, భీమ్ రావు కాలనీలో కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున ఆధ్వర్యంలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. అలాగే మండలంలోని శ్రీపురం, బసినేపల్లి తండా, బేతాపల్లి, పట్టణంలోని బీసీ కాలనీ ఉప్పర వీధి తదితర ప్రాంతాల్లో సిపిఎం ప్రజాసంఘాల నాయకులు నిరసనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు కవిత, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మద్దిలేటి, నాయకులు రంజిత్ నాయక్, వెంకటలక్ష్మి, సిఐటియు నాయకులు శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని వడ్డుపల్లి, ఆత్మకూరులో భగత్‌సింగ్ కాలనీ, బీసీ కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం భోగిమంటల్లో కరెంట్ బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్, అన్ పిఆర్‌డి జిల్లా కార్యదర్శి రామయ్య, రైతుసంఘం మండల కార్యదర్శి రాము, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉరవకొండ సిపిఎం కార్యాలయం ఆవరణలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని మోపిడి, నేరమెట్ల గ్రామాల్లో రైతులు, కార్మికులతో కలిసి విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎన్.మధుసూదన్, ప్రాంతీయ కార్యదర్శి, రంగారెడ్డి, మురళి, వీరాంజనేయులు, రవికుమార్, వెంకటేశులు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : పెంచిన కరెంటు ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కడవకల్లు గ్రామంలో సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భోగిమంటల్లో కరెంట్ బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు ఎస్.సూరి, జె.పెద్దయ్య, పెద్దక్క, పెద్దరాజు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రంలో సిపిఎం సీనియర్ నాయకుడు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్, నాయకులు శంకర్, శివ, శ్రీరాములు, భాస్కర్, రాజు, బాబా ఫక్రుద్దీన్, చంద్రకళ పాల్గొన్నారు.

రాయదుర్గం : కూటమి ప్రభుత్వం అదానీ కోసం పని చేస్తుందో.. ప్రజల కోసం పనిచేస్తుందో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని, అదానీ కంపెనీలకు లాభాలు చేకూర్చి ప్రజలపై భారాలు మోపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమా అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపుపై సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని శాంతినగర్‌లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, నాయకులు ఎన్.నాగరాజు, ప్రాంతీయ కమిటీ సభ్యులు మధు, తిమ్మరాజు, హనుమంతు, ఆంజనేయులు, రమేష్, తిప్పేస్వామి, బాబు, మల్లికార్జున, రామంజి, నాగ, రవి పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని అనంతపురం రోడ్డులో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నాయకులు సలీం, రాజశేఖర్, అరవింద్ పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : పెంచిన విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. నాయకులు ఓబులేసు, రాము, చంద్ర మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలను కూటమి ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కి విద్యుత్ బిల్లులు పెంచి ప్రజలపై భారం వేయడం తగదన్నారు.

శింగనమల : మండల పరిధిలోని శింగనమల, తరిమెల, కల్లుమడి, నిదనవాడ, రాచేపల్లి, అనందరావుపేట, ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి, చిన్నమట్లగొంది, సలకం చెరువు, ఇరువెందల గ్రామాల్లో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో తగులబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు నాయకులు జి.ఓబులు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచమని అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోపే విద్యుత్ ఛార్జీలను పెంచడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు కొండారెడ్డి, సుంకన్న, రామాంజనేయులు, సూర్యప్రకాష్, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, వెంకటస్వామి, ఓబిరెడ్డి, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, నాగేంద్ర, లక్ష్మీనారాయణ, కుళ్లాయిస్వామి, గంప మల్లయ్య, మేకల పెద్దన్న, పెద్దన్న, రామాంజనేయులు, మునెప్ప, వెంకట్రాముడు, కేశన్న, తదితరులు పాల్గొన్నారు.



ఐఎంఎల్ వద్ద విద్యుత్ ఛార్జీల బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు, హమాలీలు



శింగనమల మండలంలో భోగి మంటల్లో విద్యుత్ ఛార్జీల బిల్లులను దహనం చేస్తున్న సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు, నాయకులు



అనంతపురంలో భోగి మంటల్లో విద్యుత్ ఛార్జీల బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

అరటి చెట్ల నరికివేత నిందితులు అరెస్టు

పుట్లూరు : మండలంలోని కొండగారిగుట్ట గ్రామంలో అరటిచెట్ల నరికివేత కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సిఐ సత్యబాబు తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. కుమ్మనమల గ్రామానికి చెందిన సీలం మనోహర్, సీలం సురేంద్ర ఏసూరి, శీలం చిన్న పెద్దిరాజు, కాటం సురేష్, శీలం చిన్న పెద్దరాజును మండలంలోని నారాయణరెడ్డిపల్లి వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను విచారింగా సుదర్శన్ నాయుడు అనే వ్యక్తి తమకు రావాల్సిన ఫీల్డ్ అసిస్టెంట్, స్టోర్ డీలర్ పోస్టులకు అడ్డుపడుతున్న కారణంగా అరటిచెట్లను నరికినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో ద్విచక్ర వాహనాల దొంగలు

గుంతకల్లు రూరల్ : వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి ఆరు మెటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సిఐ ఎన్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కసాపురం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల ఎస్ఐ టిపి వెంకటస్వామితో కలిసి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గుత్తి పట్టడానికి చెందిన మోతే రాజేష్, మాల ప్రవీణ్‌కుమార్ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతుండేవారు. ఇందులో భాగంగానే స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వెనుక ఉన్న రైల్వే క్వార్టర్ సమీపంలో ఓ మహిళ మెడ నుండి బంగారు చైన్‌ను లాక్కెళ్లారు. గతంలో ఆరు కేసులరుపైగానే వీరిద్దరిపై నమోదయ్యాయి. ఈనేపథ్యంలో సోమవారం ఉదయం భగత్‌సింగ్ కాలనీలో అనుమానాస్పదంగా కనిపించడంతో ఇద్దరినీ అరెస్టు చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం నిందితుల నుంచి ఆరు మోటార్ సైకిళ్లు, 3.5 తులాల బంగారు చైను, రూ.60 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంతోపాటు వస్తువుల రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన రూరల్ సిఐ, కసాపురం ఎస్ఐ కానిస్టేబుల్ సుంకన్న, వెంకటేశును డీఎస్పీ అభినందించారు.

ముగ్గుల పోటీలు

యాడికి : సంక్రాంతి పండగను పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 150 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి కుటుంబ సమేతంగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ ఈరన్న, టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, పట్టణ అధ్యక్షులు వెలిగండ్ల ఆదినారాయణ, మాజీ ఎంపిటిసి దడియాల ఆది, జనసేన మండల కన్వీనర్ సునీల్, రాజశేఖర్‌నాయుడు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గండికోట లక్ష్మణ్, చలమారెడ్డి, నరసింహచౌదరి, బొట్టు శేఖర్, మధురాజు, తొగట వీర క్షత్రియ రాష్ట్ర యువజన కార్యదర్శి తాంద్ర విక్రమ్, విజన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ విశ్వనాథ, తెలుగు యువత నాయకుడు కోడూరు నీలకంఠారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బిజెపి మండల ఉపాధ్యక్షులు వద్ది రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవాను వెడల్పు చేసి ప్రతి ఎకరాకు నీరందించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష, కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జె.మల్లికార్జున అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ పనుల లైనింగ్ కాకుండా వెడల్పు చేసి జిల్లాకు అదనంగా నీరు తీసుకురావాలన్నారు. కాలువ డిస్ట్రిబ్యూటరీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. హంద్రీనీవా ద్వారా జిబిసి బ్రాంచి కెనాల్‌కు అధికారికంగా సాగునీరు విడుదల చేయాలన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తుంగభద్ర డ్యాం నుంచి నికరజలాలు వాడుకోవడానికి హెచ్ఎల్‌సి కాలువను ఆధునీకరణ చేసే పనులు చేపట్టాలన్నారు. తుంగభద్ర జలాశయం నుంచి పిఎబిఆర్ జలాశయానికి 11 టిఎంసిల నికరజలాలు అందించడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. మైక్రో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ఉరవకొండ నియోజకవర్గంలోని పిఎబిఆర్ జలాశయం కుడి, ఎడమ ద్వారా మిడ్‌పెన్నార్, జీడిపల్లి రిజర్వాయర్ ద్వారా 55వేల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు మధుసూదన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, అబ్బాస్, సిపిఐ నాయకులు సుల్తాన్, గన్నే మల్లేష్, పురిడి తిప్పయ్య, మురళి, రవి, రామాంజనేయులు, దేవేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మలరాయుడు, కాంగ్రెస్ నాయకులు సుధాకర్, జమీర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'ఫైటర్స్' జట్టు

ప్రజాశక్తి-గుత్తి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న టిడిపి యువ నాయకుడు ఆర్.సాల్మన్ రాజా

మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్‌లో ఉన్న రైల్వే క్రీడా మైదానంలో ఆర్డీటీ సహకారంతో నిర్వహించిన ఎపిఎల్ క్రికెట్ టోర్నీలో భాగంగా సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో ఫైటర్స్ జట్టు విజయం సాధించింది. జోషి, రఘు, మంజు, నవీన్, కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో ఫైటర్స్, ఛాలెంజర్స్ జట్లు తలబడగా ఫైటర్స్ జట్టు విజేతగా నిలిచింది. అనంతరం విజేత, రన్నరప్ జట్లకు అతిథులు ట్రోఫీతోపాటు పతకాలు అందజేశారు. ఈ క్యాక్రమంలో టిడిపి యువ నాయకులు ఆర్.సాల్మన్‌రాజా, రైల్వే ఇన్స్టిట్యూట్ కార్యదర్శి కృష్ణ, ఈదుర్‌బాషా పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో స్వెట్టర్లు పంపిణీ

ప్రజాశక్తి-నార్పల



వృద్ధులకు భోజనం అందజేస్తున్న టిడిపి నాయకులుఆకుల బాబు

మండల పరిధి లోని కేశేపల్లి గ్రామంలో ఉన్న చెన్నకేశవ వృద్ధాశ్రమంలో టిడిపి నాయకులు ఆకుల విజయకుమార్ (బాబు), ఆకుల కిషోర్ కుమార్ సోదరులు వృద్ధులకు సోమవారం స్వెటర్లు పంపిణీ చేశారు. అంతేగాకుండా సంక్రాంతి పండగను పురస్కరించుకుని మూడు రోజులపాటు వృద్ధాశ్రమంలో భోజన సౌకర్యం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. గొప్ప మనసుతో వృద్ధుల కోసం చలికోట్లు పంపిణీ చేయడం అభినందనీయమని ఆశ్రమ నిర్వాహకులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు సలేహా, వార్డు సభ్యుడు నాగభూషణం, ఇస్మాయిల్, ప్రదీప్, గోపాల్, పవన్‌కుమార్, లోకేష్, రామాంజనేయులు, శ్రీనివాసులు, జయచంద్రారెడ్డి, ముగెతంపల్లి కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికురాలికి తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-తాడిపత్రి



ఎస్‌టిపి వద్ద ప్రమాదానికి గురైన ప్రమీలను కాపాడుతున్న కార్మికురాలు

తాడిపత్రి మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికురాలు ప్రమీల పెను ప్రమాదం నుంచి తృటిలో బయటపడింది. పట్టణంలోని ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికురాలు ప్రమీల జూనియర్ ఇంజినీర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ ఎస్‌టిపి వన్ వద్ద విధులు నిర్వహిస్తోందన్నారు. విధుల్లో భాగంగా అస్వస్థకు గురైన ఆమె ఒక్కసారిగా ఎస్‌టిపి నీటి మడుగులోకి జారి పడిపోయింది. గమణించిన తోటి కార్మికులు అప్రమత్తమై వెంటనే బయటకు లాగారు. అస్వస్థతకు గురైన ప్రమీల వాంతులు చేసుకోవడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు జగన్మోహన్‌రెడ్డి, ఉమాగౌడ్, ప్రసాద్ ఆసుపత్రికి వెళ్లి కార్మికురాలిని పరామర్శించారు. విధి నిర్వహణలో ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ అధికారులు అటువైపు చూడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సిఐటియు నాయకులు మండిపడ్డారు. కార్మికులపై ఒత్తిడి తెచ్చి ఎస్‌టిపి వద్ద విధులు కేటాయించారన్నారు. దీంతోనే కార్మికురాలు అస్వస్థకు గురై ప్రమాదానికి గురైందన్నారు. ప్రమాదానికి గురైన ప్రమీలకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.



కార్మికురాలిని ఆసుపత్రిలో పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

సామాన్యులపై పోలీసుల జులుం : మేయర్



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సామాన్యులపై జులుం ప్రదర్శించి అకారణంగా దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని నగర డీఎస్పీ శ్రీనివాస్‌ను మేయర్ మహమ్మద్ వసీం కోరారు. ఆర్డీవో కార్యాలయం సమీపంలో ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంతియాజ్ అహ్మద్‌పై టూ టౌన్ కానిస్టేబుల్ హోంగార్డ్‌తో కలసి విచక్షణ రహితంగా దాడి చేయడమే కాకుండా భాధితునిపైనే కేసు నమోదు చేయడంపై మేయర్ మైనార్టీ నాయకులతో కలసి వెళ్లి డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. యువకనిపై అకారణంగా దాడి చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తన నివాసంలో జరిగిన చోరీ ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది అని అడిగినందుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంతియాజ్ అహ్మద్‌ను కానిస్టేబుల్, హోంగార్డు విచక్షణ రహితంగా చావబాదడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇటీవల కాలంలో నగరంలో సామాన్యులపై పోలీసుల దాడులు అధికమయ్యాయని ఆరోపించారు. ఘటనను విచారించి బాధితునికి న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో వైసీపీ మైనార్టీ జిల్లా అధ్యకులు సైపుల్లా బేగ్, మాజీ వక్స్ బోర్డ్ ఛైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు రహంతుల్లా, కమల్ భూషణ్, ఖాజా, నాయకులు దాదు, కాకర్ల శీనా పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రజాశక్తి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సిఐ చిన్నగౌస్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ప్రజల కోసమే పని చేస్తోందన్నారు. ప్రతిక్షణం ప్రజాపక్షంగా నిలుస్తూ వార్తల సేకరణ చేపట్టడం ఒక్క ప్రజాశక్తి దినపత్రికకే చెల్లుతుందన్నారు. అలాటి దినపత్రిక దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ ఎస్ఐ జనార్ధన్‌నాయుడు, ఎఎస్ఐ శివప్రసాద్, విడపనకల్ మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ అధికారి భాస్కర్, సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, నాయకులు మురళీ, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్ప చౌదరి, కార్యదర్శి సంజీవ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి హరుణ్‌రషీద్, సెపక్‌తక్రా క్రీడాసంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు, నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకట్, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు గణేష్‌బాబు, చాబాల సర్పంచు మల్లెల జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

పెద్దవడుగూరు : ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటర్ ఛైర్మన్ దిమ్మగుడి రాజారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా రంగంలో సమాచారాన్ని ప్రజలకు సులభంగా చేరవేస్తున్న ప్రజాశక్తి దినపత్రిక నిర్భయంగా వార్తా కథనాలు రాస్తూ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా మహిళలకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేకంగా క్యాలెండర్‌ను రూపొందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు బద్రి, దాదావలి, సంజీవరాయుడు, గిర్రప్ప, నాయుడు, చంద్ర, శివ, ప్రజాశక్తి విలేఖరి వై.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దవడుగూరులో ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దిమ్మగుడి రాజారెడ్డి



రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

అనంతపురం ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

రోడ్డు భద్రతా నియమాలు పాటించడంతోపాటు, స్వీయ జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చని ఎస్పీ పి.జగదీష్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. వారం రోజుల్లో జిల్లా పోలీసుల ఎన్‌ఫోర్స్‌మంట్ వివరాలను వెల్లడించారు. పోలీసు సిబ్బంది పేకాట, మట్కా, తదితర అసాంఘిక కార్యకలాపాలపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకున్నారు. మట్కాకు సంబంధించి 5 కేసులు నమోదు చేసి 15 మందిని అరెస్టు చేసి రూ.1,39,400 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 2 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయా కేసుల్లో 22 మందిని అరెస్టు చేసి రూ.44,260 నగదు సీజ్ చేశారన్నారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారిపై, ట్రిపుల్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, డ్రంకన్ డ్రైవింగ్, తదితర రోడ్డు భద్రతా ఉల్లంఘనదారులపై మోటారు వాహనాల చట్ట ప్రకారంగా 2,881 కేసులు నమోదు చేశారు. రూ. 5,91,855 అపరాధ రుసుం విధించామన్నారు. బహిరంగప్రదేశల్లో మద్యం తాగి, ప్రజా శాంతికి భంగం కలిగించిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 293 కేసులు నమోదు చేశారు. వీటితో పాటు మద్యం సేవించి వాహనాలు నడిపిన వాహన చోదకులపై 69 కేసులు నమోదు చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలు, మహిళా రక్షణ చట్టాలు, భద్రత, రోడ్డు సేఫ్టీ, తదితర అంశాలపై జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఆటోల ఓవర్లోడింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అప్రమత్తం చేశారు. విజిబుల్ పోలీసింగ్ లో వాహనాల తనిఖీలు, ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించినట్లు వివరించారు.



ఏ.కొండాపురం గ్రామం వద్ద దానిమ్మ తోటలను పరిశీలిస్తున్న శ్రీరామ్ తరణికంటి

పంట ఎలా ఉంది..?

ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి

ప్రజాశక్తి-తాడిపత్రి, పుట్లూరు

పంటల సాగు ఎలా ఉంది.. పెట్టుబడులు సంగతేంటి అంటూ ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి రైతులను అడిగి తెలుసుకున్నారు. తాడిపత్రి, పుట్లూరు మండలాల్లో కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి సోమవారం పర్యటించారు. తాడిపత్రి మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డితో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. తాడిపత్రి మండలంలోని చుక్కలూరు సిద్ధార్థ కోల్డ్ స్టోరేజ్‌లో ఫ్రూట్ కేర్ యాక్టివిటీలో రైతులకు కంపెనీ ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తోంది, బనానా హార్వెస్టింగ్, ప్రీ కూలింగ్ యూనిట్‌లో స్టోరేజ్, ఎగుమతికి సంబంధించి, లాజిస్టిక్స్ వివరాలను అధికారులతో తెలుసుకున్నారు. పుట్లూరు మండలం ఏ.కొండాపురం గ్రామం వద్ద దానిమ్మ తోటలను పరిశీలించారు. దానిమ్మ పంట సాగు, డ్రిప్ సౌకర్యం, పెట్టుబడులు, ఆదాయం వివరాలను రైతులతో ఆరా తీశారు. ఎ.కొండాపురం వద్ద చామంతి తోటలను పరిశీలించారు. ముచ్చుకోట గ్రామం వద్ద బనానా ప్యాకింగ్, ఎగుమతి, గ్రేడింగ్, వాషింగ్ చేసే యూనిట్ ని తనిఖీ చేసి పలు వివరాలు రైతులతో తెలుసుకున్నారు. అంతకు మునుపు తాడిపత్రిలోని శ్రీ బుగ్గ రామలింగే శ్వర స్వామి, శ్రీ చింతల వెంకటరమణ స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, ఏపీఎంఐపీడీ రఘు నాథరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి పల్లవి, తహశీల్దార్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.





